సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు

రాజ్యసభ సభ్యుడిగా చివరి ప్రసంగంలో వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, ఫిబ్రవరి 8: రాజ్యసభ సభ్యుడిగా తాను చరిత్రలో నిలిచిపోయే శాసనాల్లో భాగ స్వామిని కావడం అదృష్టంగా భావిస్తున్నానని, సభ్యుడిగా ఉన్నంతకాలం తనకు సహకరించిన నేతలు, ఎంపీలందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవి చంద్ర ప్రకటించారు. ఢిల్లీలోని పార్లమెంట్‌లో గురువారం జరిగిన పెద్దల సభ చివరి ప్రసంగంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో అడుగుపెట్టే అవకాశం కల్పించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు ఆజన్మాంతం రుణపడి ఉంటానన్నారు. రాజ్యసభ సభ్యుడిగా తాను 20 నెలల్లో పాత పార్లమెంట్‌లోనూ, కొత్త పార్లమెంట్‌లోనూ కూర్చున్నందుకు అదృష్టవంతుడిగా భావిస్తున్నానన్నారు. తాను మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కోసం పార్లమెంట్‌లో చర్చించించినందుకు, తెలంగాణలో ఏదైనా ఒక సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని మాట్లాడినందుకు ఆనందంగా ఉందన్నారు. ముున్ముందు కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మరిన్ని సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నానని తన ప్రసంగాన్ని ముగించారు.

భద్రగిరీశునికి నిత్య కల్యాణం

భద్రాచలం, ఫిబ్రవరి 8: భద్రాద్రి దివ్య క్షేత్రంలో భద్ర గిరీశుడైన రామయ్యకు అర్చకులు గురువారం బేడా మండపంలో నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

భద్రాద్రి పరిశుభ్రత.. మనందరి బాధ్యత

ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం, ఫిబ్రవరి 8: పుణ్య క్షేత్రమైన భద్రాద్రి పంచాయతీని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యంత మనందరిపై ఉందని పంచాయతీ స్పెషలాఫీసర్/ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. భద్రాచలంలోని గోదావరి కరకట్ట, ఐటీడీఏ వెనుక వైపున మనుబోతుల చెరువు వద్ద నిర్మిస్తున్న తడి–పొడి చెత్త శుద్ధి కర్మాగారాన్ని గురువారం పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు. తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డులో వేర్వేరుగా వేయించాలన్నారు.

కరకట్టను పరిశీలిస్తున్న పీవో ప్రతీక్ జైన్

ఏఎస్ఐ శ్రీనివాసరావు ఆకస్మిక మృతి

శ్రీనివాసరావు (ఫైల్)

దమ్ముపేట, ఫిబ్రవరి 8 : గుండెపోటుతో విధి నిర్వహణలో ఉన్న ఏఎస్ఐ శ్రీరాముల శ్రీనివాసరావు(59) గురువారం ఆకస్మికంగా మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, మధిర పట్టణానికి చెందిన శ్రీనివాసరావు సుమారు రెండేళ్లుగా దమ్మపేట పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ములుగు జిల్లాలోని సమ్మక్క, సారక్క ఆలయం వద్ద విధులు నిర్వహించి దమ్మపేట స్టేషన్‌కు గురువారం తిరిగి వచ్చిన శ్రీనివాసరావు గుండెల్లో నొప్పిగా ఉందని, చెమటలు పడుతున్నాయని చెప్పడంతో పోలీస్ వాహనంలో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉందని సత్తుపల్లి తీసుకెళ్లాలని వైద్యుల సూచనతో అంబులెన్స్‌లో సత్తుపల్లి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు.

సింగరేణి భవిష్యత్ ప్రణాళికపై అవగాహన

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 8: ఇల్లెందు ఏరియాలో జీఎం కార్యాలయంలో డిపార్ట్‌మెంటల్ టీమ్స్ నిర్వహణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీఎం జాన్‌ఆనంద్ మాట్లాడారు. సంస్థ అందించిన సంక్షేమ కార్యక్రమాలు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఉత్పత్తి లక్ష్యాలు సాధించేందుకు కార్యాచరణ ప్రణాళికలపై కార్మికులకు అవగాహన కల్పించారు. సంస్థపై వినియోగదారుడు పెట్టుకున్న నమ్మకాని వమ్ము చేయకుండా నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం మల్లార్‌రావు మల్లయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఆటల్లో ఓడినా విజేతలే..

విజేత జట్టుకు బహుమతులు అందజేస్తున్న డీఎస్ సత్యనారాయణ

అశ్వారావుపేట, ఫిబ్రవరి 8 : ఆటల పోటీల్లో ఓడిన క్రీడాకారులు సైతం విజేతలేనని, క్రీడా పోటీల్లో పాల్గొనడమే విజయానికి పునాది అని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్ డాక్టర్ జెల్లా సత్యనారాయణ అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో మూడు రోజులపాటు జరిగిన అంతర్ కళాశాలల క్రీడా పోటీ ముగింపు కార్యక్రమం గురువారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. నాణ్యమైన విద్యతోపాటు క్రీడలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్, యూనివర్సిటీ పరిశీలకులు జె.సురేశ్, ఏఎస్ఏ డాక్టర్ మధుసూదన్, కళాశాల ప్రొఫెసర్లు, పీడీలు పాల్గొన్నారు.

'పేట' విద్యార్థి ప్రతిభ..

అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో అశ్వారావుపేటకు చెందిన వ్యవసాయ కళాశాల విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. నారంవారిగూడెంకు చెందిన భూక్యా బాలకృష్ణ రుద్రూర్ కమ్యూనిటీ ఫుడ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో చదువుతున్నాడు. అశ్వారావుపేటలో జరిగిన అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో బాలకృష్ణ 400, 800, 1,500, 3,000 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ, 4 x 400 మీటర్ల పందెంలో తృతీయ బహుమతులు గెలుపొంది సత్తా చాటాడు. బాలకృష్ణను కళాశాలల అధ్యాపక, బోధనేతర సిబ్బంది అభినందించారు.

SHRIRAM Finance Limited WANTED
మార్కెటింగ్ & రికవరీ ఎగ్జిక్యూటివ్స్ కొత్తగూడెం, పాల్వంచ మరియు భద్రాచలం నందు కావలెను.
అర్హతలు : 1) డిగ్రీ పాసై ఉండాలి, వయస్సు : 25 సం॥లోపు ఉండవలెను. 2). బైక్ తప్పని సరిగా ఉండాలి. 3) జీతం : నెలకు 15000/- ప్లస్ ఇన్సెంటివ్స్
Interview Dates : 09-02-2024, 10-02-2024
ఆఫీస్ చిరునామా : RMR ప్లాజా, 1st ఫ్లోర్, MG Road, కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
ఆసక్తి గల వారు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : బ్రాంచ్ మేనేజర్ : 8978380080, 9666289896, డివిజనల్ మేనేజర్ : 8978380079

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి: ఎస్పీ

మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 8: సైబర్ నేరాలు, ర్యాగింగ్, డ్రగ్స్‌పై విద్యార్థులు, యువతీ యువకులు అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. సుజాతనగర్ మండలం వేపలగడ్డలో ఉన్న అబ్దుల్‌కలాం ఇంజినీరింగ్ కళాశాలలో డీఎస్పీ రెహమాన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్పీ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అమాయకుల డబ్బును దోచుకోవడానికి సైబర్ నేరగాళ్లు అనేక మార్గాల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడి అకౌంట్ల నుంచి నగదు పోగొట్టుకుంటే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలను అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీని కళాశాల యాజమాన్య బాధ్యులు సన్మానించారు. చుంచుపల్లి సీఐ పెద్దన్నకుమార్, సుజాతనగర్ ఎస్సై సోమేశ్వర్, కళాశాల యాజమాన్య బాధ్యులు వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, సీతారాంప్రసాద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం..

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 8: మానసిక, శారీరక ఒత్తిడి నుంచి దూరమయ్యేందుకు క్రీడలు ఎంతగానో దోహదుపడతాయని ఎస్పీ రోహిత్‌రాజు పేర్కొన్నారు. నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా సంబురాల పోస్టర్‌ను గురువారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. శారీరక రుగ్మతలు దూరం కావాలంటే క్రీడలు, వ్యాయామాలు వంటివి ఎంతో అవసరమని అన్నారు. అనంతరం ఈ నెల 15, 16, 17 తేదీల్లో కొత్తగూడెం సింగరేణి ప్రకాశం మైదానంలో నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం నిర్వహిస్తున్న క్రీడా సంబురాల పోస్టర్‌ను ఎస్పీ ఆవిష్కరించారు. టీఎన్‌జీవో బాధ్యులు అమరనేని రామారావు, సాయిభార్గవ్, వీరబాబు, సోమయ్య, సీహెచ్ రామనర్సయ్య, ఉష, శివనందిని, విజయలక్ష్మి, నర్సింహారావు, కిషోన్ పాల్గొన్నారు.

ఖమ్మం డీసీసీబీ డైరెక్టర్ శేఖర్ సహా

ముగ్గురు ఆలయ పాలకమండలి సభ్యుల అరెస్ట్

డీసీసీబీ డైరెక్టర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మధు, మాజీ ఎమ్మెల్యే కందాళ

జీళ్లచెర్వు ఆలయ పరిధిలోని గుట్ట, కుంటలో మట్టి తవ్వకాలపై దేవాదాయశాఖ ఫిర్యాదు

కూసుమంచి, ఫిబ్రవరి 8: ఆలయ పరిధిలోని గుట్ట, కుంటల్లో అక్రమంగా మట్టిని తవ్వించి, సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలపై పోలీసులు బుధవారం అర్ధరాత్రి ఖమ్మం డీసీసీబీ డైరెక్టర్లలో ఒకరైన ఇంటూరి శేఖర్‌తోపాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గోపాలరావుపేటకు చెందిన ఇంటూరి శేఖర్ మూడేళ్ల నుంచి ఖమ్మం డీసీసీబీ పరిధిలో సేవలందిస్తున్న డైరెక్టర్లలో ఒక డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈయన కొన్నాళ్ల క్రితం కూసుమంచి మండల పరిధిలోని జీళ్లచెర్వు సీతారామచంద్రస్వామి ఆలయ పరిధిలోని గుట్టలు, కుంటల్లో అక్రమంగా మట్టిని తవ్వించి డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ సొమ్ము చేసుకున్నారని, ఈ అక్రమాలతో ఆలయ పాలక మండలి చైర్మన్ చెన్నా వెంకన్న, సభ్యులు కొండా వెంకన్న, చింతలపాటి రామకృష్ణకూ ప్రమేయం ఉందని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన ఫిర్యాదు మేరకు బుధవారం సాయంత్రం కూసుమంచి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అర్ధరాత్రి పోలీసులు ఖమ్మం నగరంలోని మమత ఆసుపత్రిలో నివాసం ఉంటున్న ఇంటూరి శేఖర్, జీళ్లచెరువులో నివాసం ఉంటున్న చెన్నా వెంకన్న, కొండా వెంకన్న, చింతలపాటి రామకృష్ణ ఇండ్లకు వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితులను కొన్ని కారణాల రీత్యా నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గురువారం ఉదయం కూసుమంచి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్సై కె.రమేశ్ కుమార్ నిందితులపై ఐపీసీ 120/బీ, 409, 420, 447, 339 సెక్షన్లు, 3 అండ్ 4 పీడీపీపీ సెక్షన్ల ప్రకారం కేసులు నమో దు చేశారు. అనంతరం నిందితులను ఖమ్మం కోర్టులో హాజరు పరిచారు. నిందితులకు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్‌తో పాటు ముగ్గురు ఆలయ పాలకమండలి సభ్యులను అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో శేఖర్ సతీమణి, జడ్పీటీసీ బేబీ, శేఖర్ అనుచరులతో కలిసి బుధవారం అర్ధరాత్రి కూసుమంచి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. కానీ శేఖర్‌తోపాటు మరో ముగ్గురిని నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారని సమాచారం అందుకుని, అక్కడికి వెళ్లి ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, పార్టీ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుతోపాటు పలువురు నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అరెస్ట్ చేయడం సరికాదని ధర్నా చేశారు. పోలీసులు గురువారం ఉదయం నిందితులను ఖమ్మం కోర్టుకు తరలించగా అక్కడగా వారిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పరామర్శించారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు

అన్నపురెడ్డిపల్లి/అశ్వారావుపేట రూరల్/అశ్వారావుపేట టౌన్/చండ్రుగొండ, ఫిబ్రవరి 8 : పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట మండలం, పట్టణం, చండుగొండ మండలాల్లోని అన్ని గ్రామాల్లో గురువారం పారిశుధ్య పనులను నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది సంయుక్తంగా ప్రధాన వీధుల వెంట పారిశుధ్య పనులు చేపట్టారు. రోడ్ల వెంబడి చెత్తా చెదారం, మురుగునీరు తొలిగింపు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. స్వచ్ఛతకు మారుపేరుగా గ్రామాలను తయారు చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీవో రేవతి, ఎంపీవో తులసీరాం, హెచ్ఎం కృష్ణకుమారి, తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై విచారణ

అశ్వారావుపేట, ఫిబ్రవరి 8 : విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటూ గైరాజ్జరవుతున్న ఉపాధ్యాయుడిపై ఎంఈవో గురువారం విచారణ నిర్వహించారు. మండలంలోని వడ్డె రంగాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జి.లక్ష్మయ్య తరచూ విధులకు హాజరుకావడం లేదు. దీంతో గత నెల 29న గ్రామస్తులు ఎంఈవో పి.కృష్ణయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంఈవో గురువారం పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. గ్రామస్తులు, విద్యార్థులతో మాట్లాడి ప్రధానోపాధ్యాయుడి వివరాలు సేకరించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయుడి సంజాయిషీ ప్రకారం ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తానని తెలిపారు.

శివపార్వతుల కల్యాణం

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 8 : మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో గురువారం శివపార్వతుల కల్యాణ మహోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. మాస శివరాత్రి పురస్కరించుకొని ఆలయంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు జరిగేలా చూడాలి

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 8 : ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు జరిగేలా చూడాలని జిల్లా మాతా శిశు సంక్షేమ ప్రోగ్రాం అధికారి డాక్టర్ చైతన్య అన్నారు. గురువారం మండలంలోని ఎర్రగుంట ప్రభుత్వ వైద్యశాలను ఆయన సందర్శించి, రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు చేశారు. వైద్యసేవల వివరాలను వైద్యాధికారి ప్రియాంకను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

1/70 చట్టం పటిష్ట అమలుకు వినతి

గుండాల, ఫిబ్రవరి 8: మండలంలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివాసీలు గురువారం గుండాలలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారుకు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు పూనెం రమణబాబు, గుంపిడి వెంకటేశ్వర్లు, కొడెం వెంకటేశ్వర్లు, వీసీ దొర, గొగ్గెల రాజేష్ పాల్గొన్నారు.

'ఫోర్‌మెన్లను కేటీపీఎస్, బీటీపీఎస్‌లో సర్దుబాటు చేయాలి'

పాల్వంచ, ఫిబ్రవరి 8: వైటీపీఎస్‌లో ఉన్న తమను కేటీపీఎస్, బీటీపీఎస్ కర్మాగారాల్లో సర్దుబాటు చేయాలని 148 మంది ఫోర్‌మెన్లు కోరారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం వారు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. జీవో 19ను రద్దు చేయాలని, జీవో 6ను పునరుద్ధరించాలని కోరారు.

సంక్షిప్తం

రూ.లక్ష ఆర్థిక సాయం

పాల్వంచ, ఫిబ్రవరి 8: కేటీపీఎస్ 6వ దశ సీ బ్యాచ్ షిఫ్టులో పనిచేస్తున్న గ్రేడ్ 4 ఆర్టిజన్ తాటి దేవదానం ఇటీవల మరణించాడు. ఈ సందర్భంగా కేటీపీఎస్ ఎస్ఈలు, ఇంజినీర్లు, ఓఅండ్ఎం కార్మికులు, ఆర్టిజన్లు మానవతా దృక్పథంతో స్పందించి రూ.1,05,000ను సమకూర్చారు. చెక్కును కేటీపీఎస్ సీఈ ప్రభాకర్‌రావు గురువారం తన కార్యాలయంలో మృతుడి సతీమణి తాటి అశ్వినికి అందజేశారు. ఇంజినీర్లు, ఫోర్‌మెన్ పాల్గొన్నారు.

జెన్కో క్రీడాకారులకు సన్మానం

పాల్వంచ, ఫిబ్రవరి 8: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన టీఎస్ జెన్కో ఇంటర్ ప్రాజెక్ట్స్ హాకీ, బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను కేటీపీఎస్ ఏడో దశ సీఈ వెంకటేశ్వరరావు గురువారం తన కార్యాలయంలో సన్మానించారు. శాలువా కప్పి షీల్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయస్థాయిలోనూ విజయం సాధించి సంస్థకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

బీటీపీఎస్ పరిధిలో..

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 8: మణుగూరులోని బీటీపీఎస్‌లో జరిగిన టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్ బాస్కెట్‌బాల్, హాకీ టోర్నమెంట్‌లో బీటీపీఎస్ జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఈ జట్టును బీటీపీఎస్ సీఈ బిచ్చన్న గురువారం అభినందించారు. స్పోర్ట్స్ సెక్రటరీ కల్తీ నరసింహారావు, జట్టు మేనేజర్ ఎస్.వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 8: ఐదుగురు పేకాట రాయుళ్లను గురువారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎర్రగుంటలో పేకాట ఆడుతున్నరన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.37 వేలు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

మద్యం దుకాణం సీజ్

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 8: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న దుకాణాన్ని ఎక్సైజ్ అధికారులు గురువారం సీజ్ చేశారు. ఎక్సైజ్ సీఐ బీ రాంప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లెందులోని గణేశ్ వైన్స్ నిర్వహకులు 21 సంవత్సరాలలోపు యువతకు మద్యం విక్రయిస్తున్నారన్న విశ్వనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. యువతకు మద్యం అమ్ముతున్నారని నిర్ధారణ కావడంతో మద్యం దుకాణాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. అదేవిధంగా మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన బానోత్ మంగీ నాటు సారాయిని విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని తహసీల్దార్ కోట రవికుమార్ ఎదుట ఆమెని హాజరు పరిచి రూ.లక్ష జరిమానా విధించామన్నారు. జరిమానా కట్టకపోవడంతో ఆరు నెలల జైలు శిక్ష కోసం ఖమ్మం జైలుకు తరలించామన్నారు.

సింగరేణి ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 8: సింగరేణి ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం ప్రాధాన్యం ఇస్తున్నదని మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్(జీఎం) దుర్గం రామచందర్ అన్నారు. 'మన సంస్థ, మన గని, మన బాధ్యతలు' పేరుతో ఏరియా వ్యాప్తంగా వివిధ అంశాలపై మల్టీ డిపార్ట్‌మెంట్ టీం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా గురువారం జీఎం కార్యాలయం, ఓసీ–4 గనిని టీం సందర్శించింది. ఉద్యోగులు, అధికారులతో టీం కన్వీనర్/జీఎం రామచందర్ మాట్లాడుతూ.. నాణ్యమైన బొగ్గు రవాణా చేయాలన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

చండ్రుగొండ, ఫిబ్రవరి 8 : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల ప్రత్యేకాధికారి సంజీవరావు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ప్రతిరోజూ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు పరీక్షలంటే భయం పోతుందన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

పినపాక, ఫిబ్రవరి 8: రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ప్రమాదాలకు దూరంగా ఉండాలని సీఐ శివప్రసాద్ కోరారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా స్థానిక తోగ్గూడెంలో గ్రామస్తులకు గురువారం అవగాహన కల్పించారు. మద్యం మత్తులో వాహనం నడపొద్దని, ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు సత్యం తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

దమ్మపేట, ఫిబ్రవరి 8 : ఇటీవల ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాతి తీసుకుంటున్న మల్కారం మాజీ సర్పంచ్ రూప్‌సింగ్‌ను మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గురువారం పరామర్శించారు. అనంతరము రాచూరుపల్లిలో ప్రమాదంలో కాలు కోల్పోయిన మడకం నాగరాజును పరామర్శించారు.

విలువైన కలపకు కరువైన కాపలా

లక్ష్మీదేవిపల్లి మండలంలోని కేఎస్ఎం ఇంజినీరింగ్ కాలేజీ భూముల్లో ఉన్న విలువైన కలపకు రక్షణ కరువవుతోంది. మెడికల్ కాలేజీ నిర్మాణం కోసం ఇక్కడ తొలగించిన టేకు చెట్ల కలపకు సంబంధిత అధికారులు సరైన రక్షణ కల్పించలేదు. ఎటువంటి భద్రత, కాపలా లేకుండా రోడ్డుకు పక్కనే పడేసి ఉంచారు. ప్రస్తుతం మార్కెట్‌లో టేకు కలపకు మంచి డిమాండ్ ఉంది. మెడికల్ కాలేజీకి ప్రభుత్వం స్థలం ఇవ్వకముందు ఈ భూముల్లో విలువైన టేకు చెట్లు విరివిగా ఉండేవి. సుమారు 50 నుంచి 60 ఎకరాల్లో ఈ చెట్లను అధికారులు తొలగించారు. ఆ తొలగించిన చెట్ల కాండాలకు నంబర్ వేసి అక్కడే వదిలేశారు. ఇటీవల కొందరు ఈ కలపను చోరీ చేసేందుకు ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. అధికారులు స్పందిస్తారో లేదో చూడాలి.

– లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 8

పది కేజీల గంజాయి పట్టివేత

పాల్వంచ, ఫిబ్రవరి 8: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పాల్వంచ పట్టణ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన షేక్ రిజ్వాన్ అహ్మద్ ఏపీలోని సీలేరు నుంచి 10 కేజీల గంజాయి ప్యాకెట్లను తన బ్యాగులో నింపుకొని హైదరాబాద్ వెళ్లే బస్సు ఎక్కాడు. బస్సు పాల్వంచ చేరుకునే క్రమంలో పోలీసులు జీసీసీ గోడౌన్ వద్ద వాహనాలను తనిఖీ నిర్వహిస్తున్నారు. అప్పటికే బస్సులోనుంచి ఈ తనిఖీలను గమనించిన అహ్మద్.. తాను కూడా పట్టుబడతానని గ్రహించి బ్యాగుతో సహ బసులోంచి కిందకు దూకి పారిపోవడానికి ప్రయత్నించాడు. పోలీసులు గమనించి అతడిని వెంబడించి పట్టుకున్నారు. అతడి బ్యాగును పరిశీలించగా అందులో 10 కేజీల గంజాయి ప్యాకెట్లు ఉన్నాయి. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.2.60 లక్షలు ఉంటుందని అంచనా. ఈ దాడుల్లో పాల్వంచ పట్టణ ఎస్సై బాణాల రాము, అదనపు ఎస్సై రాఘవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కిన్నెరసాని కాలువలో పడి చిన్నారి మృతి

పాల్వంచ, ఫిబ్రవరి 8: ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ కిన్నెరసాని కాలువలో జారిపడి మూడేళ్ల చిన్నారి మృతిచెందిన ఘటన పాల్వంచలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కోదాడ టీచర్స్ కాలనీకి చెందిన జర్పుల మంజుల తన ఇద్దరు పిల్లలతో కలిసి గాజులగూడెంలో తన పుట్టింటికి మూడు రోజుల క్రితం వచ్చింది. గురువారం ఉదయం తాను ఇంట్లో పనిచేస్తుండగా పిల్లలు ఆడుకోవడానికి ఇంటి పక్కనే ఉన్న కిన్నెరసాని కాలువ గట్టుకు వెళ్లారు. ఈ క్రమంలోనే మంజుల చిన్న కుమారుడు కుశాల్ (3) ప్రమాదశాత్తూ కాలు జారి కాలువలో పడ్డాడు. అతడితోపాటు ఆడుకోవడానికి వచ్చిన చిన్నారి రిత్విక అరవడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. అదే సమయంలో పక్కనే ఉన్న గుగులోత్ రవి కాలువలోకి దిగి కుశాల్‌ను ఒడ్డుకు చేర్చాడు. కానీ అప్పటికే మునిగి ఊపిరాడక కుషాల్ మృతిచెందాడు. మృతుడి తల్లి జర్పుల మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ఒకరు..

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 8: తేనెటీగల దాడిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని తుమ్మలగూడెంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అదే గ్రామానికి చెందిన కుంజా ముసలయ్య (50) గత నెల 31న అదే గ్రామంలోని పొలంలో కూలి పనులు చేస్తున్నాడు. అ సమయంలో సమీప చెట్టుకు ఉన్న తేనెటీగలు అతడిపై దాడిచేశాయి. తీవ్రంగా గాయపడిన అతడికి కుటుంబ సభ్యులు పాల్వంచలో ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం కొత్తగూడెంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అతడు మృతిచెందాడు. మృతుడికి భార్య,కుమారుడు ఉన్నారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పాల్వంచ రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృత్తి శిక్షణ అధ్యాపకులకు గౌరవ వేతనం

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 8: సింగరేణి సేవా సమితి కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో వివిధ సింగరేణి కాలనీల సేవా సెంటర్లలో నిర్వహిస్తున్న వృత్తి విద్యా కోర్సుల శిక్షణ అధ్యాపకులకు సింగరేణి ప్రధాన కార్యాలయంలో జీఎం (పర్సనల్) బసవయ్య గౌరవ వేతనాల చెక్కులను గురువారం అందజేశారు. సంస్థ సామాజిక బాధ్యతగా సింగరేణి గృహిణులకు, పరిసర ప్రాంత మహిళలకు ఎన్నో వృత్తి విద్యా కోర్సులు అందిస్తోందని, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తోందని అన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా రాణించాలని ఆకాంక్షించారు.

వివాహిత అదృశ్యంపై కేసు

భద్రాచలం, ఫిబ్రవరి 8: పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన వివాహిత తోట నాగమణి(25) గత ఏడాది అక్టోబర్ 29న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం భర్త దుర్గాప్రసాద్ వెతికినప్పటికీ జాడ తెలియలేదు. ఆయన గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసును ఎస్సై విజయలక్ష్మి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 8: మండలంలోని అంజనాపురం గ్రామ శివారులో బుధవారం రాత్రి బొమ్మ–బొరుసు జూదం ఆడుతున్న ఎనిమిది మందిని ఎస్సైలు రాజ్‌కుమార్, నాగభిక్షం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.15,200, ఎనిమిది సెల్ ఫోన్లు స్వాధీనపర్చుకున్నారు.

రేషన్ కార్డు, ఆధార్ తప్పని సరి

అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 8 : ప్రభుత్వం గృహ ఉచిత విద్యుత్ పథకంలో భాగంగా లబ్ధిదారులు తెల్లరేషన్ కార్డు, ఆదార్ కార్డు జిరాక్స్‌లను సంబంధిత అధికారులకు అందించాలని విద్యుత్ అధికారులు తెలిపారు. గురువారం గృహజ్యోతి లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఇంటింటి సర్వే నిర్వహించారు. వడ్డెర బజార్, చింతల బజార్, చిన్నంశెట్టి బజార్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి రేషన్ కార్డు, ఆధార్, ఫోన్ నెంబర్ వంటి వివరాలను సేకరించారు. అందుబాటులో లేని గృహ యజమాని తమ వివరాలను అందుబాటులో ఉంచాలన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ

పినపాక, ఫిబ్రవరి 8: మండలంలోని మద్యం దుకాణాలను ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను సేకరించారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పి.కరంచంద్ పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రికెట్ పోటీలు

జూలూరుపాడు, ఫిబ్రవరి 8: ఏన్కూరు, జూలురుపాడు, చంద్రుగొండ మండలాల స్థాయి క్రికెట్ పోటీలను ఈ నెల 10 నుంచి జూలూరుపాడులో నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి షేక్ చాంద్ పాషా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 95020 79142 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మన రాష్ట్రం మన పత్రిక నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319433-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.